PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

DK MEDIA

approved by Govt of INDIA, TELANGANA

OUR SERVICES
* NEWS PAPER
* NEWS CHANNEL
* DK GRAPHICS
* DK ADS & PROMOTIONS
* DK PRINTERS
* DK PUBLICATIONS

WE'RE HIRING REPORTERS

for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 01 సంచిక : 325 బుధవారం, జూన్ 17 2026 , పేజీలు - 5 వెల : 5 రూ/-

## బీజేపీ తొత్తుగా కేంద్ర ఎన్నికల సంఘం



**సంగారెడ్డి, జూన్16:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. అలాంటి దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. 2002లో ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని.. కానీ ప్రస్తుతం వారికి ఓట్లు పడవనుకుంటే వాటిని తొలగిస్తుందన్నారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ లో ఎస్ఐఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితోపాటు తన ఓటు గల్లంతు అయినా ఆశ్చర్య పోనక్కర్లేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యంగ్యంగా అన్నారు. తమ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బీఎల్ఏ కీలకంగా పని చేయాల్సి ఉందని చెప్పారు. రాజకీయాల్లో తనకు దామోదర రాజనర్సింహ ఓనమాలు నేర్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ దేశంలో అతికొద్ది మంది నిజాయితీపరుల్లో మీనాక్షి నటరాజన్ ఒకరని పేర్కొన్నారు. రాజ్యసభ నామినేషన్ పత్రాన్ని తిరస్కరించారని తెలిపారు. బీజేపీ వాళ్లకి కనికరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలి

- వ్యవసాయ శాఖపై సీఎం సమీక్ష
- ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యత అప్పగించాలని ఆదేశం




**హైదరాబాద్ :** విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యచరణ అమలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వచ్చే వ్యవసాయ సీజన్ సాఫీగా జరిగేలా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. బోనస్ వచ్చే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారానే బుక్ చేసే విధానం తీసుకురావాలని అన్నారు. రామగుండం కర్మాగారంలో ఉత్పత్తయ్యే ఎరువులు అత్యధికంగా తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి, ఎరువులపై వాస్తవ పరిస్థితిని వివరించాలని సీఎం తెలిపారు.

రైతుల వివరాల నమోదు : రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని సీఎం అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్?లో రానున్న వ్యవసాయ సీజన్‌పై సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సూచనలను సమీక్షించారు. వచ్చే సీజన్ కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని అదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌరసరఫరాల శాఖ ఎండీ, ప్రణాళిక శాఖ కార్యదర్శి సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు. అందుబాటులో 7 రకాల సన్న వడ్ల విత్తనాలు : కనీస మద్దతు ధరలు కేంద్రం నిర్దేశించిన కోటాకు అనుగుణంగా రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు.

## సింగపూర్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు
## 'ఏఐ అమరావతి' రోడ్‌మ్యాప్..!



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటనలో రెండో రోజు అత్యంత బిజీగా గడిపారు. అక్కడ జరుగుతున్న అంతర్జాతీయ 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సమ్మిట్‌లోని లీడర్షిప్ ప్లీనరీ–2లో 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే వినూత్న అంశంపై సీఎం చంద్రబాబు ప్రసంగించారు. గతంలో తాను ఐటీ రంగంలో వేసిన అడుగులు నేడు తెలుగువారిని గ్లోబల్ లీగ్‌లో ఎలా నిలబెట్టాయో వివరిస్తూనే.. భవిష్యత్తు అమరావతి రాజధాని నగర గ్లోబల్ విజన్‌ను ప్రపంచ దేశాల ప్రతినిధుల ముందు ఉంచారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను తీసుకున్న ఐటీ నిర్ణయాల ఫలితాలను సీఎం ప్రపంచ వేదికపై గర్వంగా పంచుకున్నారు. సరిగ్గా 25 ఏళ్ల క్రితం నేను ఐటీ గురించి మాట్లాడినప్పుడు చాలామంది ఆశ్చర్యపోయారు. కానీ ఆ రోజు 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్' తీసుకోవడం వల్లే ఈరోజు ప్రపంచవ్యాప్తంగా తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో ముందంజలో ఉన్నారు. నాడు మేము శ్రమించి నిర్మించిన సైబరాబాద్.. నేడు తెలంగాణ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా మారింది. నాడు ఐటీ వేవ్ ఉంటే, నేడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ () ప్రపంచాన్ని శాసిస్తోందని..కానీ నేడు అక్కడ ఎకరం భూమి మార్కెట్ విలువ అక్షరాలా రూ.200 కోట్లకు పెరిగింది. విజనరీ లీడర్షిప్‌తో అభివృద్ధి చేస్తే ఎంతటి సంపద సృష్టి సాధ్యమో చెప్పడానికి సైబరాబాద్ కంటే గొప్ప ఉదాహరణ లేదు అని ట్రేడ్ వర్గాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## జవాబుదారీతనం అనే పరీక్షలో బీజేపీ ఫెయిల్



**న్యూ ఢిల్లీ :** పేపర్ల లీకేజీ, పరీక్షల అక్రమాలు జరిగినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం తీవ్ర విమర్శలు చేశారు. సదరు మంత్రిని రాజీనామా చేయమని కోరకపోవడం ద్వారా మోదీ సర్కార్ జవాబుదారీతనం అనే పరీక్షలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జూన్ 21న జరగనున్న నీట్–యూజీ 2026 రీ–ఎగ్జామ్‌కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్?పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని కూడా ఆయన ఎక్స్? వేదికగా తప్పుపట్టారు."నీట్ రీ–టెస్ట్ కోసం మోదీ సర్కార్ టెలిగ్రామ్ యాప్?ను తాత్కాలికంగా బ్లాక్ చేసింది. కానీ కోట్లాది మంది యువత భవిష్యత్తును బ్లాక్ చేసిన తమ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని రాజీనామాను ప్రధాని మోదీ కోరాలి. దేశంలోని చైతన్యవంతులైన యువత కేవలం ఒక్కటే డిమాండ్ చేస్తున్నారు. అదే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ఇది జవాబుదారీతనానికి మొదటి పరీక్షగా మారింది. దురదృష్టవశాత్తు బీజేపీ ఈ పరీక్షలో పూర్తిగా విఫలమైంది."భారత వైమానిక దళాన్ని రంగంలోకి దించడం, టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం లేదా పేపర్ లీక్ మాఫియాను రక్షించేందుకు చిన్న చేపలను పట్టుకోవడం– ఇవన్నీ మోదీ ప్రభుత్వం చేయాల్సి వస్తోంది. ఎందుకంటే గత 10 ఏళ్లలో 90 పేపర్ లీక్?లు జరిగాయి. ఈ మోసం, అవినీతి వల్ల 9 కోట్ల మంది యువత నష్టపోతున్నారు. కప్పిపుచ్చుకుంటుంది" అని ఖర్గే ప్రశ్నించారు.

## ఇంటి నుంచే యూరియా
### బుకింగ్ చేసుకునే సౌకర్యం



**కామారెడ్డి, జూన్16:** రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు.స్మార్ట్ ఫోన్ లేని రైతులకు టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్దరైతులు ఆందోళన చెందవద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా రైతులకు స్పష్టం చేశారు.

## హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు

**హైదరాబాద్ :** గతంలో మెట్రో ఫేజ్–1కు కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని తెలిపారు. సాంకేతిక, ఆర్థిక విషయాలు చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే సాకారమవుతాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విమర్శల నేపథ్యంలో ఢిల్లీలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

తెలంగాణ ప్రజలకు జవాబుదారీ : తెలంగాణ కావున, కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని, అనాలోచితంగా, దుందుడుకుగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సమంజసం కాదని హితువు కిషన్ రెడ్డి పలికారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. మోదీకి, తనకు, కేంద్రానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా చేశారు. తాము రేవంత్ రెడ్డికి జవాబుదారీ కాదని, తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని వెల్లడించారు.

హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నాం : తెలంగాణ అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పని చేశామని, ఇప్పుడూ పని చేస్తామని, తెలంగాణకు ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డగా, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశానని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఢిల్లీకు వచ్చి రెండుసార్లు ధర్నా చేశామని గుర్తు చేశారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించానని గుర్తు చేశారు.ప్రధాని చేతుల మీదుగా



ఫేజ్–2 ప్రారంభించాం : తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్న కేంద్రమంత్రి హితువు పలికారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని తెలిపారు. రేవంత్ రెడ్డి కోరితే రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టలేదని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టిందని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్–2 కోసం కేసీఆర్ సహకరించకలేదని ఆరోపించారు. కేసీఆర్ సహకరించకపోయినా ప్రధాని చేతుల మీదుగా ఫేజ్–2 ప్రారంభించామన్నారు. తెలంగాణకు రాదనుకున్న రైల్వే ఫ్యాక్టరీని సాధించామని, ఏ పార్టీల ప్రభుత్వాలు ఉన్నా అన్ని రాష్ట్రాలకు కేంద్రం సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు.

## జీ-7 సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా మోదీ, ట్రంప్
### - ట్రేడ్ డీల్‌పై చర్చ

**ఫ్రాన్స్:** ఫ్రాన్స్‌లోని ఎవియాన్ వేదికగా జరుగుతున్న 52వ జీ–7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జీ–7 సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ 'ఫ్యామిలీ ఫోటో' సెషన్ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొద్దిసేపు ముచ్చటించారు. ఇద్దరు నేతలు కరచాలనం చేసుకోగా, మోదీ భుజంపై ట్రంప్ ఆప్యాయంగా తట్టారు. గతేడాది ఫిబ్రవరిలో వాషింగ్టన్‌లో జరిగిన పర్యటన తర్వాత వీరిద్దరూ నేరుగా కలుసుకోవడం ఇదే తొలిసారి. ఆ తర్వాత జరిగిన అవుట్‌రీచ్ సెషన్‌లోనూ ఇరు దేశాల అధినేతలు పక్కాపక్కనే కూర్చుని చర్చల్లో పాల్గొన్నారు. అంతకుముందు సదస్సు ప్రాంగణానికి చేరుకున్న ప్రధాని మోదీకి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఘన స్వాగతం పలికారు.

## తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



**కరీంనగర్, జూన్ 16:** తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం కిషన్ రెడ్డికి లేదన్నారు. అర్థంలేని ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ సర్టిఫికెట్ తమకు అవసరం లేదని వ్యాఖ్యానించారు. 'సర్' విషయంలో కాంగ్రెస్ గందరగోళం చేస్తోందని మండిపడ్డారు. బంగ్లాదేశ్ వాళ్లకు ఓటు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఇతర దేశాల వారి ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని కేంద్ర మంత్రి నిలదీశారు.మావోయిస్టులు చివరికి సాధించింది ఏంటి అని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తుపాకీ గొట్టంతో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని.. అభం శుభం తెలియని మైనర్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. చివరికి మావోయిస్టు సంస్థని నిషేధానికి గుర య్యేలా చేశారని వ్యాఖ్యానించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని మావోయిస్టు అగ్ర నేతలు కూడా గుర్తించారని.. కేంద్రానికి సహకరించి చాలామంది లొంగిపోయారన్నారు. మావోయిస్టులు ఇక లేరని అన్నారు.

బుధవారం,
జూన్ 17 2026

PRGI No: TGBIL/25/A0046
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక



# పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలి





- కుంగిపోయిన కల్వర్టుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాలజ్యోతి):** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్ళపల్లి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ అంకిత్ ఆళ్ళపల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య హాజరు శాతం వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ విభాగం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు అందిస్తున్న బోధన విధానం విద్యా కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు నాణ్యమైన విద్యపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించేందుకు సిద్ధంగా ఉంచిన భోజనం పాలు బాలామృతం తదితర పోషకాహార పదార్థాలను పరిశీలించారు. కేంద్రంలో కేవలం ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండటాన్ని గమనించిన కలెక్టర్ హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్ద వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గొత్తికోయలు నివసించే ఈ మారుమూల గిరిజన ప్రాంతంలో బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ పిల్లల సంఖ్య వారికి అందిస్తున్న సేవలు పోషకాహార సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో తక్కువ మంది పిల్లలు ఉన్నప్పటికీ అధిక మొత్తంలో నిల్వలు ఉండటాన్ని గమనించి అవసరానికి మించి ఉన్న సరుకులను సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అలాగే కేంద్రాల్లో పిల్లల చేరికలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిశీలన సందర్భంగా పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్ర భవనానికి పెయింటింగ్ వేయించి పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా, పోషకాహార సేవలు అందేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి నుండి పెద్ద వెంకటాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు కుంగిపోయి ఉండటాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గమనించారు. వెంటనే వాహనం దిగి కల్వర్టును పరిశీలించిన కలెక్టర్ వర్షాకాలంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అత్యవసరంగా మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలు సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆళ్లపల్లి తాసిల్దారు ఉషారాణి, ఎంఈఓ శాంతారావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రూ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత



**హైదరాబాద్ విశాలజ్యోతి:** ట్రూ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, సైఫాబాద్ ఎసిపి శ్రీ మోహన్ కుమార్ గారి చేతుల మీదుగా కృష్ణానగర్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని పృథ్వీ, మునీ దివ్య లకు విద్యా సహాయార్థం రూ.10,000/- రూపాయల చెక్కును అందజేయడం జరిగింది. ప్రస్తుతం ఆ విద్యార్థిని శ్రీ సాయి రామ్ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతోంది. ఆమె విద్యాభివృద్ధికి ఈ సహాయం ఉపయోగపడాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ట్రూ హెల్పింగ్ హాండ్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ గొగికార్ రోహిత్ గారు, జాయింట్ సెక్రటరీ బైకని శ్రీశైలం యాదవ్ గారు మరియు మనోహర్ గారు పాల్గొన్నారు. "విద్యే సమాజ అభివృద్ధికి పునాది." ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా తన చదువుకు దూరం కాకూడదనే సంకల్పంతో మా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని ట్రూ హెల్పింగ్ సంస్థ సభ్యులు తెలిపారు.

## వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



- వైద్యాధికారి తుకారాం రాథోడ్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాలజ్యోతి):** వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి తుకారాం రాథోడ్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం వైద్య అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం ప్రతి వైద్య అధికారి ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజల ఆరోగ్య సూచికలను మెరుగుపరచేందుకు కృషి చేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన గర్భధారణ పూర్వ సేవలు అందించాలని పేర్కొన్నారు. సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రక్తపోటు ఊబకాయం నియంత్రణకు స్క్రీనింగ్ కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. క్షయవ్యాధి కుష్ఠ వ్యాధి డెంగ్యూ మలేరియా తదితర వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించి దోమల నివారణ చర్యలను కట్టుదిట్టం చేయాలన్నారు. యాంటీ లార్వల్ ఆపరేషన్లు నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. పాఠశాలలు కళాశాలలు హాస్టళ్లలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులు రిజిస్టర్లు నివేదికలను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అన్ని ఆరోగ్య కేంద్రాలు సిద్ధంగా ఉండాలని సూచించారు.

వైద్య అధికారులు తమ పరిధిలోని గ్రామాలను తరచుగా సందర్శించి ఆ రోగ్య కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డాక్టర్ శ్రీధర్, సాయి కళ్యాణ్, ప్రసాద్, ప్రతాప్, రాకేష్ , దినేష్, హరీష్, ఎం ఎల్ హెచ్ పీ లుయూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ఈ నెల25న ఉపసర్పంచుల మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



- ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు జోగు అనిల్

**జనగాం జిల్లా, విశాలజ్యోతి:** హైదరాబాదులోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఉపసర్పంచ్ల మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం జనగామ జిల్లా కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు జోగు అనిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు, రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపు గౌరవ వేతనాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఉపసర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని నెలకు రూ" 5000లకు వార్డు సభ్యుల వేతనాన్ని రూ"3000లకు పెంచాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గురువారం జరిగే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లాలోని ఉప సర్పంచ్లు ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## "మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలిలి




**తొర్రూరు విశాలజ్యోతి:** తొర్రూరు మున్సిపాలిటీలోని కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనెలు డ్రెస్సులు వెంటనే అందించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తొర్రూర్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ గారికి నేడు ఒక వినతిపత్రం వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కార్మికులకు గత ఆరు నెలలుగా కార్మికులకు అందాల్సిన సబ్బులు, కొబ్బరినూనెలను వెంటనే అందించాలని అన్నారు.గత సంవత్సర కాలంగా బట్టలు కార్మికులకు ఇవ్వలేదని వాటిని వెంటనే ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. పిఎఫ్,ఈఎస్ఐ బకాయి లేకుండా ప్రతినెల చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.జీవో నెంబర్ 60 ని సవరించి కార్మికులకు కనీస వేతనం అందించాలని ప్రస్తుతం దేశంలో ధరలు పెరిగి ఆకాశాన్ని అంటుతుంటే వేతనాలు మాత్రం పెరగకపోతే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. నిత్యవసర సరుకులు ధరలు పెట్రోల్,డీజిల్,వంట గ్యాస్ ధరలు ఇతర వినియోగ వస్తువుల ధరలు భారీగా పెరిగాయని అన్నారు.ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని వేతనాలు పెంచాలని ఆయన అన్నారు. స్పందించిన కమిషనర్ గారు ఉన్నత అధికారులు,పాలకమండలితో మాట్లాడి వీలైనంత తొందరలో ఈ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వేల్పుల మహేందర్ తొర్రూర్ మున్సిపల్ అధ్యక్షుడు మంగళపల్లి గురుకుల యాకయ్య, ఉపాధ్యక్షులు మాచర్ల మురళి, టియుసిఐ తొర్రూర్ ఏరియా కమిటీ అధ్యక్షులు ఎండి షరీఫ్, మహేష్ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పణ




- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న యాదవ్

**విశాలజ్యోతి (దంతాలపల్లి)** దంతాలపల్లి మండల తాహాసిల్దార్ కార్యాలయంలో వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళ వారం అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న అఖిల భారత రైతు కూలీ సంఘం తొర్రూరు డివిజన్ అధ్యక్షులు చిర్ర యాకన్న సంయుక్తంగా మాట్లాడుతూ రైతుల సమస్యలను ఘాటుగా ప్రస్తావించారు.

**కల్తీ విత్తనాలు పురుగుమందుల దందా**

ఇటీవలే అధికారులు నకిలీ విత్తనాలు పురుగు మందులు పట్టుకున్నట్టుగా వార్తలు వస్తున్నప్పటికీ వాటిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు మోసపోతున్నారు. కల్తీ వ్యాపారులపై పీడీయాక్ట్ వంటి కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.పాత రుణాల భారం కొత్త రుణాలు అందుబాటులో లేకపోవడం రైతులు ఇప్పటికే పాత రుణాల కింద నలిగిపోతున్నారు. ప్రభుత్వం వెంటనే పాత రుణాలను పూర్తిగా మాఫీ చేసిరైతులకు కొత్తగా 'రోల్ ఆన్ లైన్' ద్వారా సులభంగా రుణాలు అందించే విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు:**

పెట్రోల్ డీజిల్ ఎరువుల ధరలు అమాంతం పెరగడంతో వ్యవసాయం రైతుకు భారంగా మారింది. ఉత్పత్తి ఖర్చులు పెరిగినా గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతున్నారు. గిట్టుబాటు ధరలు మీరా అమలు లోపం స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మీరా చట్టబద్ధం చేయకపోవడం రైతులకు అన్యాయం. అన్ని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల వలసలు వ్యవసాయం సంక్షోభంలో ప్రస్తుత పరిస్థితులు కొనసాగితే రైతులు వ్యవసాయం వదిలి పట్టణాలకు వలస కూలీలుగా మారే ప్రమాదం ఉంది అని హెచ్చరించారు.ఇది దేశ ఆహార భద్రతకు సంబంధించిన కీలక సమస్య అని పేర్కొన్నారు.

దేశానికి అన్నం పెట్టే రైతును కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాజన్ పష వర్రె వెంకన్న భారతి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు దుర్మరణం



**మహబూబాబాద్ జిల్లా విశాలజ్యోతి:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల పరిధిలోని కల్వల గ్రామంలో మంగళవారం ఉదయం ఒక తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. తాటి చెట్టు పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఒక వృద్ధ గీత కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కల్వల గ్రామానికి చెందిన ప్రముఖ గీత కార్మికుడు వేముల మల్లేశం (65) ప్రతిరోజూలాగే మంగళవారం ఉదయం కల్లు గీసేందుకు గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కుతున్న సమయంలో అకస్మాత్తుగా అదుపుతప్పి పైనుంచి కిందపడిపోయాడు. తలకు, శరీర భాగాలకు తీవ్రమైన గాయాలయ్యాయి. రక్తస్రావం ఎక్కువగా కావడంతో మల్లేశం అక్కడికక్కడే కన్నుమూశారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడు మల్లేశంకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కష్టపడి కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతిలో మునిగిపోయింది. గ్రామంలో మంచి వ్యక్తిగా పేరున్న మల్లేశం మరణంతో కల్వల గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## రాజీతో సమస్యను పరిష్కరించుకోండి




- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐ పి ఎస్.

**వరంగల్, విశాలజ్యోతి:** ఈ నెల 20వ తేదీ శనివారం జరిగే రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ జాతీయ మెగా లోక్ ఆదాలత్ సంబందించి వరంగల్ కమిషనరేట్ పోలీసులు రూపొందించిన వాల్ పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 20 వ తేది శనివారం రోజున రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో , అనగా క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ,విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుంది అని తెలిపినారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది. కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమం వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, పరకాల ఇన్స్ స్పెక్టర్ క్రాంతికుమార్, దామెర ఎస్.ఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే




- గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హనుమకొండ జిల్లా, విశాలజ్యోతి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండలోని గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో మంగళవారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ పేరుతో నిర్మించిన సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా పేదవాడి జీవితం మార లేదని అన్నారు. పేదలు సిపిఐ ఆధ్వర్యంలో అనేక చోట్ల భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. పాలకులు పేదల అనుకూల విధానాలను అవలంబించడం లేదని, కమ్యూనిస్టులు లేకుంటే తెలంగాణాకే విముక్తి జరిగేది కాదని అన్నారు. గుండ్లసింగారంలో ఎంతో దీక్ష, పట్టుదలతో కాలనీ నిర్మించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని, కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా తాను అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో అవసరం అయితే సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, మాలోత్ శంకర్, శనిగరపు రాజు కుమార్, కొట్టె వెంకటేష్, వేల్పుల సారంగపాణి, అనుకారి అశోక్, రాసమల్ల దినా, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు మాదాసి కళ్యాణ్, గాదె రాజన్న, కట్కూరి కృష్ణ, జన్ను కృష్ణ, నాయకులు పోనుగోటి రాము గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, కొడెపాక బాబు, మామునూరి దామోదర్, గుడికందుల శివ, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, బైసా మౌనిక, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటి రజిత, వందలాది ఇండ్ల వాసులు తదితరులు పాల్గొన్నారు.

PRGI No: TGBIL/25/A0946
సమగ్ర తెలుగు దినపత్రిక

## ఉప్పరపల్లి లో వ్యక్తి దారుణ హత్య...!!



**మహబూబాబాద్, విశాలజ్యోతి:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో ఇనుపరాడ్లతో ఓ వ్యక్తి తలపై మోది హత మార్చిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పరపల్లికి చెందిన కుండె నరేశ్ (36) అదే గ్రామానికి చెందిన కంకల కుమారస్వామి, కనకమ్మ దంపతుల కుమార్తె అనూషను వివాహం చేసుకున్నాడు. నరేశ్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, అత్తగారింటి వద్ద రాత్రి నరేశ్ దారుణ హత్యకు గురయ్యాడు. ఇనుపరాడ్లతో తలపై మోదడంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. సంఘటన స్థలానికి ఎస్సై క్రాంతికిరణ్ చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, నరేశ్ హత్యకు కుటుంబ కలహాలే కారణమని తెలుస్తోంది.

## ప్రజా మద్దతుతో రాజ్యాధికార సమరభేరి మహాసభ



● పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్

**హైదరాబాద్ విశాలజ్యోతి:** తెలంగాణలో బహుజనులకు రాజకీయ అధికారాన్ని సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ చేపట్టిన రాజ్యాధికార సమరభేరి మహాసభకు రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. జూలై 5న జరగనున్న ఈ మహాసభను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పడిషరీఫ్ డివిజన్ హుస్మాన్ నగర్లో మాజీ కౌన్సిలర్ మహమ్మద్ మజార్ అలీ గారిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ గారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బహుజన వర్గాల రాజకీయ సాధికారత, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్, రంగారెడ్డి జిల్లా యువజన అధ్యక్షులు పాకాల నరసింహ, సంపత్, మహమ్మద్ గౌస్ భాయ్, కాజా పాషా, ఖయ్యూం, ముస్తఫా, సాజీత్, పరివేశ్, ఖలీల్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాయకులు హుస్మాన్ నగర్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, ఉపాధి తదితర సమస్యలను పరిశీలించారు. అధికార పార్టీల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బహుజనుల రాజకీయ అధికారం సాధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న జూలై 5 రాజ్యాధికార సమరభేరి మహాసభకు ప్రజలు, యువత, మహిళలు, మైనార్టీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎలుపునిచ్చారు.

తెలంగాణ రాజకీయాల్లో బహుజన శక్తుల ఐక్యతకు ఈ మహాసభ చారిత్రాత్మక వేదిక కానుందని పేర్కొన్నారు.

## తెలంగాణ విట్టల్ గారికి రాజ్యాధికార సమరభేరి ఆహ్వాన పత్రిక అందజేత



● బహుజన వర్గాల రాజకీయ సాధికారత కోసం ఐక్య పోరాటం అవసరం.
● పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క

**హైదరాబాద్, విశాలజ్యోతి:** జులై 05న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభకు సంబంధించి పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క ఆధ్వర్యంలోని బృందం ప్రముఖ గాయకుడు, ప్రజాకళాకారుడు తెలంగాణ విట్టల్ గారిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేసింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, బహుజన వర్గాల రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధన తదితర అంశాలపై చర్చించారు. రాజ్యాధికార సమరభేరి సభ లక్ష్యాలను వివరిస్తూ బహుజన వర్గాల ఐక్యత, చైతన్యం కోసం కళాకారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పటేల్ వనజక్క మాట్లాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు ఐక్యంగా ముందుకు వచ్చినప్పుడే రాజ్యాధికార సాధన సాధ్యమవుతుందని అన్నారు. ప్రజల సమస్యలను పాటల ద్వారా, కళారూపాల ద్వారా సమాజానికి చేరవేస్తున్న కళాకారులు బహుజన ఉద్యమానికి బలంగా నిలవాలని కోరారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ బహుజన వర్గాల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పనిచేస్తోందని, జులై 05న భువనగిరిలో జరిగే రాజ్యాధికార సమరభేరి సభ బహుజన ఉద్యమ చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలుస్తుందని తెలిపారు. జులై 05న భువనగిరిలో జరిగే రాజ్యాధికార సమరభేరి సభకు బీసీ సంఘాల నాయకులు, యువత, మహిళలు, కళాకారులు, సామాజిక ఉద్యమకారులు, బహుజన వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏటిగడ్డ అరుణక్క, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు గిరగాని బిక్షపతి గౌడ్, బత్తినీ మీనాక్షి గౌడ్, నవీన్ పటేల్, అర్కుటి శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



● ప్రవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల లు
● పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్.

**కామారెడ్డి జిల్లా విశాలజ్యోతి:** కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ భూంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ గైని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులను పాఠ్య పుస్తకాలను నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు దోహదం చేసేలా జ్ఞానమైన విద్య బోధన అందిస్తున్నారన్నారు. ప్రవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నారని. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దానే రాజయ్య వార్డ్ మెంబర్ ముకుంద గారి సుధాకర్ రావు ప్రధానోపాధ్యాయులు లోకేశ్వర్ ఉపాధ్యాయులు మాలతి. చింతాల లింగం. ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

## జీ7 సదస్సులో మోదీతో ట్రంప్ షేక్‌హ్యాండ్.. 16 నెలల తర్వాత కలుసుకున్న మోదీ, ట్రంప్



ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కరచాలనం చేసుకున్నారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సు దీనికి వేదికైంది. మోదీ, ట్రంప్ దాదాపు 16 నెలల తర్వాత కలుసుకున్నారు. జీ7 సదస్సు మంగళవారం ఫ్రాన్స్‌లోని ఎవియన్ లెస్ బియాన్స్‌లో ప్రారంభమైంది. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమాన్యుయేల్ మేక్రాన్ ఈ సదస్సుకు నేతృత్వం వహిస్తున్నారు. సదస్సుకు హాజరైన ప్రధాని మోదీకి మేక్రాన్ స్వాగతం పలికారు. ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా సభ్య దేశాధినేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీ, ట్రంప్ కలుసుకుని, షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నారు. కొద్దిసేపు మాట్లాడుకున్నారు. అనంతరం సదస్సులో ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. గత ఏడాది ఫిబ్రవరి తర్వాత ట్రంప్, మోదీ కలుసుకోవడం ఇదే మొదటిసారి. అప్పుడు మోదీ అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఇక, బుధవారం కూడా ట్రంప్, మోదీ మధ్య ప్రత్యేక సమావేశం జరగనుంది. ఇరు దేశాధినేతలు కీలక అంశాలపై చర్చిస్తారు. ఒకవైపు ఇరాన్ యుద్ధం, అంతకుముందు ఇండియా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత ట్రంప్, మోదీ మధ్య భేటీ జరగడం కీలకంగా మారింది.

అందులోనూ రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరినప్పటికీ పూర్తిస్థాయి అవగాహనకు రావాల్సిఉంది. జీ7 సదస్సు సందర్భంగా వివిధ దేశాధినేతలు గ్రూప్ ఫొటో తీయించుకున్నారు.

ఈ సదస్సులో ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఈజిప్ట్ ప్రెసిడెంట్ అబ్దెల్ ఫత్తా ఎల్ సిసి, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, కెనడా ప్రధాని మార్క్ క్యార్నీ, జపాన్ ప్రధాని సానే తకైచి, యూరప్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్, బ్రెజిల్ ప్రెసిడెంట్ లుయిజ్ ఇనాసి యోలులాడ సిల్వా, యురోపియన్ యూనియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా పాల్గొన్నారు.

## వర్షాకాల వ్యాధుల నివారణకు సిద్ధంగా ఉండండి



● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు

**వరంగల్ విశాలజ్యోతి:** ఐ. ఎం. ఎ. వరంగల్ సమావేశ మందిరంలో జిల్లాలోని వైద్య అధికారులకు, ఎం.ఎల్. ఎచ్.పి. లకు, సూపర్ వైజర్ లకు, సబ్ యూనిట్ ఆఫీసర్ లకు పల్స్ పోలియో ప్రోగ్రామ్, జాతీయ నులిపురుగుల నిర్మూలన (ఎన్.డి.డి) కార్యక్రమం, స్టాఫ్ డైయేరియా ల పై శిక్షణా కార్యక్రమము మరియు వర్షాకాల వ్యాధుల నివారణపై సంసిద్ధత (మాన్సూన్ ప్రిపేరెన్స్) పై అవగాహన కార్యక్రమం లను డా.బి. సాంబశివ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి గారు మాట్లాడుతూ ఈ నెల 28 తేదీన పల్స్ పోలియో కార్యక్రమంను అన్ని వార్డులు, గ్రామాలలో నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో 0 నుండి 5 సంవత్సరం వయస్సు గల పిల్లల కు 2 పోలియో చుక్కలు (బి-ఓపివి) వేస్తారు. 28.6.26 నాడు వేయించుకోని పిల్లలకు 29, 30 జూన్ తేదీ నాడు గృహ సందర్శన ద్వారా వేయడం జరుగుతుంది అన్నారు. నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా జూలై 13 నాడు 1 నుండి 19 సంవత్సరాల వయస్సు వారికి అల్బండజోల్ మాత్రలను అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల యందు మింగించడం జరుగుతుంది. ఇది సురక్షిత మాత్ర అని అన్నారు. జూలై 18 న మాప్ అప్ డే నిర్వహిస్తాం అని అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16 నుండి 5 సంవత్సరం ల లోపు పిల్లలు గల ఇంటికి గృహ సందర్శన ద్వారా 2 ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు జింక్ టాబ్లెట్స్ అందిస్తారు. పిల్లలకు నీళ్ల విరోచనాలు అయినపుడు ఓ ఆర్ ఎస్ ద్రావణం త్రాగించాలి మరియు జింక్ టాబ్లెట్స్ 14 రోజులు వాడాలి అని అన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఓ ఆర్ ఎస్ కార్నర్ ఏర్పాటు చేయాలి అని, కలిపిన ఓ ఆర్ ఎస్ ద్రావణం ను 24 గంటల లోపు వాడాలి అని, ఆ తరువాత కొత్తగా ఓ ఆర్ ఎస్ ద్రావణం తయారు చేసి వాడాలి అని అన్నారు. వర్షాకాల సంసిద్ధం గురించి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలలో అత్య అవసర మందులు, యాంటీవీరం లాంటివి అందుబాటులో ఉంచుకోవాలి అన్నారు. కీటక జనిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న ప్రాంతాల గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి అని, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయము చేసుకొని నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఐ.ప్రకాష్, డాక్టర్ సయ్యద్ ఇక్తాదార్ అహ్మద్, డా. ఆర్. రాజమౌళి, డాక్టర్ సాజిదా, డా.అరుణ్ జోషి , డావిజయ్ కుమార్ , డి ఎం ఓ శ్రీమతి రజిని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, పట్టణ ఆరోగ్య కేంద్రంల వైద్య అధికారులు, ఎం ఎల్ ఎచ్ పి లు, సబ్ యూనిట్ ఆఫీసర్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.2.50 లక్షల విలువైన మెగా సేవా కార్యక్రమం



● ములుగు జిల్లా వ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థినులకు 50 ఉచిత సైకిళ్ల పంపిణీ

**ములుగు జిల్లా, విశాలజ్యోతి:** రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ మరియు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో, సుమారు రూ.2.50 లక్షల విలువైన మెగా సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ములుగు జిల్లా పరిధిలోని 10 మండలాల నుంచి 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థినులు, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మరో ముగ్గురు విద్యార్థినులు చొప్పున ఎంపిక చేసి, మొత్తం 50 మంది బాలికలకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మంత్రి సీతక్క గారు ముఖ్య అతిథిగా పాల్గొని, ములుగు జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ బోర్కడే హేమంత్ సహదేవరావు గారుతో కలిసి విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. ఈ సేవా కార్యక్రమం సాయి వంశీ ప్రాజెక్ట్ సి ఎస్ ఆర్ నిధుల సహకారంతో, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్‌కు చెందిన రొటేరియన్ మల్లికార్జున్ రెడ్డి గారు మరియు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్‌కు చెందిన కొరే చంద్రమౌళి గారి స్పాన్సర్‌షిప్‌తో విజయవంతంగా నిర్వహించబడింది. అలాగే రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ అధ్యక్షులు రొటేరియన్ కళ్యాణ్ గారు, కార్యదర్శి రొటేరియన్ లక్ష్మి గారు, రొటేరియన్ బాలకోటి రెడ్డి గారు విశేష సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ ప్రతినిధులతో పాటు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ అధ్యక్షులు ఎం. గణేష్ కుమార్ గారు, కార్యదర్శి పొన్న హరినాథ్ గారు, కోశాధికారి బి. కుమారస్వామి గారు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ మరియు ఏ జీ ఈ రొటేరియన్ పి. రత్నాకర్ గారు, జాయింట్ సెక్రటరీ రొటేరియన్ ఈ. కిరణ్ గారు, సెక్రటరీ-ఎలెక్ట్ నాయిని అనిల్ కుమార్ గారు, చీఫ్ ఆఫ్ మీడియా & ప్రెస్ డైరెక్టర్ బేతి అశోక్ బాబు గారు, క్లబ్ చార్టర్ మెంబర్, క్లబ్ ట్రైనర్ మరియు ప్రాజెక్ట్ ప్రధాన స్పాన్సర్ రొటేరియన్ పీపీ, పై హెచ్ ఎఫ్ కొరే చంద్రమౌళి గారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క గారు రోటరీ క్లబ్‌లు ములుగు జిల్లాలో ప్రజా సేవ కోసం చేస్తున్న విశేష కార్యక్రమాలను ప్రశంసిస్తూ, రోటరీ జూబ్లీ హిల్స్ ప్రతినిధులు మరియు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ అధ్యక్షులు, కార్యదర్శి, ప్రాజెక్ట్ స్పాన్సర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం రోటరీ క్లబ్ ప్రతినిధులు కూడా మంత్రి సీతక్క గారిని, జిల్లా కలెక్టర్ ఛ జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ బోర్కడే హేమంత్ సహదేవరావు గారిని అందమైన శాలువాలతో ఘనంగా సన్మానించారు. సుమారు 400 మంది సభ్యులు మరియు ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.

## వైకుంఠ రథం రిపేర్ చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలి



● మేనేజర్‌కి వినతి పత్రం అందించిన సిపిఐ జిల్లా నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాలజ్యోతి):** కొత్తగూడెం కార్పొరేషన్ లో రిపేర్ లో ఉన్న అంతిమ రథం(వైకుంఠ రథం) బాగు చేయించి దాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని భద్రాద్రి కొత్తగూడెం సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం మేనేజర్ ప్రసాద్‌కి వినతి పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత వైకుంఠ రథం నిరుపేదలకు ఎంతో అనుకూలంగా ఉండేదని గత మూడు నెలల నుండి రిపేర్లో ఉండటంవల్ల ఎవరైనా కాలం చేసిన సందర్భంలో కార్పొరేషన్ రథం లేక ప్రైవేటు వైకుంఠ రథాన్ని ఆశ్రయించవలసి వస్తుందని అన్నారు. ఆర్థికంగా పేదవారికి భారం పడుతుందని ఈ సందర్భంగా మేనేజర్‌కి వివరించారు.తక్షణమే వైకుంఠ రథాన్ని బాగు చేయించి ఉపయోగంలోకి తేవాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

వినతి పత్రం అందించిన వారిలో వనందాసు గడ్డ శాఖవన్ కార్యదర్శి తోగరు నరేంద్ర కుమార్, నాయకులు బానోత్ ఓం నారాయణ, ఎస్.కె జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత.. ఇద్దరు నిందితులు అరెస్టు



**బూర్గంపహాడ్, జూన్ 16 :** ద్విచక్రవాహనంపై అక్రమంగా గంజాయి తరలిస్తూ బూర్గంపహాడ్ పోలీసులకు ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు.

ఎస్ ఐ మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... ఒడిస్సా నుండి ములుగు జిల్లా మంగపేటకు బజాజ్ పల్సర్ వాహనంపై అక్రమంగా 2.1 కిలోల గం జాయి తరలిస్తుండగా ములుగు జిల్లా మంగపేటకు చెందిన బడే భరత్, ఉప్పరపల్లి వెంకటేశ్‌ను మండల పరిధిలోని సారపాక పల్లె ప్రకృతి వనం వద్ద పోలీసులు పట్టుకున్నారు.

పట్టుబడిన గంజాయి విలువ రూ. 1.5 లక్షలు ఉంటుందని తెలిపారు.

గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## మతీన్ అండ్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



● కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్
● 400మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

**కరీంనగర్, విశాలజ్యోతి:** నగరంలో తరచూ ఏదో ఒక సందర్భంలో సామాజిక కార్యక్రమాలను చేపడుతూ సమాజ సేవ చేస్తున్న మతిన్ అండ్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శాస్త్రి రోడ్‌లో మతీన్ అండ్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి ప్రముఖ సామాజిక కార్యకర్త ఎం.ఏ మతిన్ జన్మదినం సందర్భంగా నగరంలోని 66 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన, సుమారు 400మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్ళను పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు హాజరై మాట్లాడారు. నగరంలోని 66వ డివిజన్ కు చెందిన సామాజిక కార్యకర్త ఎం.ఏ మతిన్ తన జన్మదినం సందర్భంగా ఔదార్యాన్ని చాటడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం అకాడమిక్ ఇయర్ ప్రారంభమైన దృష్ట్యా పేద విద్యార్థులకు పెన్నులు పెన్సిల్లు నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్స్ లను పంపిణీ చేసి ఉదారతను చాటడం హర్షించదగ్గ విషయం అన్నారు. కోవిడ్ 19 లో 615కుటుంబాలకు నెలకు సరిపడా రేషన్ సరుకులను అందించారని గుర్తు చేశారు. కోవిడిలో మృతి చెందిన వారి అంత్యక్రియలను సైతం నిర్వహించారన్నారు. కుల మతాలకతీతంగా అనాధ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం, ఫుడ్ ఫర్ హంగర్ కార్యక్రమం ద్వారా ప్రతి శనివారం 250 మందికి సరిపడా అంగడిలో ఉచిత భోజన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. గోల్డెన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎంఏ మతినున్న హయాంలో ప్రభుత్వ ఆసుపత్రిలో 3,500 లీటర్ల ప్యూరిఫైడ్ వాటర్ సిస్టంను విరాళంగా ఇచ్చారని చెప్పారు. రెగ్యులర్గా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. మృత్యువుతో పోరాడే రోగులకు ఉచిత అంబులెన్స్ సర్వీస్ను సైతం అందుబాటులోకి తెచ్చారు.

భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే విధంగా మానవ సేవయే మాధవసేవ పరమావధిగా శ్రీరామనవమి సందర్భంగా అన్నదానం అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రంజాన్ మాసంలో సైతం ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిం చడంతోపాటు వారి మానసిక ఉల్లాసానికి క్రీడలను సైతం నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. పైన పేర్కొన్న కార్యక్రమాలను గడచిన మూడు సంవత్సరాలుగా నిర్విరామంగా కొ నసాగిస్తున్నారు. కిసాన్ నగర్‌లో పోచమ్మ గుడి నిర్మాణానికి భూమిని విరాళంగా ఇచ్చి ఉదారతను చాటారు.

మానవాళికి నిదర్శంగా నిలిచిన బృహత్తర కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక సేవలో తరిస్తున్న ఎంఏ మతిన్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మతిన్ అండ్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాడ వీరారెడ్డి, ఉపాధ్యక్షుడు పెద్ది వేణు, నగునూరి వేణు, మంద విజయ్, డాక్టర్ అస్మత్, మాడిశెట్టి రాము, తాళ్లపల్లి చిన్న, కీర్తి శ్రీను, డాక్టర్ అబ్దుల్ ఖుద్దుస్, మొహసీన్, అహ్మద్, గోటికార్ ప్రకాశ్, పోలోజు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఒత్తిడితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య కాశిబుగ్గలో విషాదం



**వరంగల్:** సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడటం వరంగల్ జిల్లాలో కలకలం సృష్టించింది. ఢిల్లీలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కాశీబుగ్గకు చెంది న యువతి మానసిక ఒత్తిడితో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
వివరాల్లోకి వెళ్తే.. కాశీబుగ్గలో పాత పేపర్లు కొనే వ్యాపారం చేసే గంజి ఉమాశంకర్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో రెండు కుమార్తె గంజి కీర్తన (25) ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. ఇటీవల పనిభారంతో కీర్తన తీవ్ర మానసిక ఒత్తిడికి గురైంది. మానసికంగా డిప్రెషన్‌లోకి వెళ్లిన కూతుర్ని చూసిన తల్లిదండ్రులు మూడు నెలల క్రితం వరంగల్‌కు తీసుకొచ్చారు. హనుమకొండలోని ఓ మానసిక వైద్యుడి వద్ద కొంతకాలంగా చికిత్స కూడా ఇప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి కీర్తన ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది.

# ధాన్యం కొనాలని రోడ్డెక్కిన రైతులపై కేసులు నమోదు చేసిన పోలీసులు



**నెన్నెల :** కష్టపడి పండించి పంటలను కొనాలని కోరడమే కాంగ్రెస్ పాలనలో నేరమవుతున్నది. ధాన్యం కొనుగోలు చేయాలని నిరసన తెలిపిన రైతులపై పోలీసులు కుట్రపూరితంగా కేసులు నమోదు చేసస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గొల్లపల్లిలో గత నెల 20న ధాన్యం కొనాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేసిన రైతులపై పోలీసులు గుట్టు చప్పుడు కాకుండా కేసులు నమోదు చేశారు. నెల రోజులైనా కాంట వేయడం లేదని కాంట అయిన బస్తాలను తరలించడం లేదని ఆరోపిస్తూ గొల్లపల్లిలో రోడ్డుపై ధాన్యం బస్తాలతో నిరసన చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సులోచన, నెన్నెల ఎస్ఐ రామకృష్ణ రైతులను సముదాయించి ఆందోళన విరమింప చేయడానికి యత్నించారు. అంతకు ముందు రైతులకు తహసిల్దార్ సైతం ధాన్యం కాంట చేసి లారీలను పంపుతామని ఫోన్‌లో చెప్పడంతో రైతులు ఆందోళన విరమించుకున్నారు. అంతా అయిపోయిందని రైతులు భావించారు. కానీ పోలీసులు మాత్రం రైతులపై గుట్టుచప్పుడు కాకుండా మూడు వారాలు దాటాక ఆరుగురు రైతులపై కేసు నమోదు చేసారు. చింత పురుషోత్తం, జాడి నారాయణ, గడ్డం తిరుపతి గౌడ్, చింత సురేష్, ఇందూరి రమేష్, వేల్పుల మొగిలి పై 126(2),221,292 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసారు. చింత సురేష్ స్థానికంగా లేకున్నా పోలీసులు ఆయన పై కేసు పెట్టారు. పోలీసులు రైతులపై అక్రమ కేసులు పెట్టడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతునాయి. దీనిపై పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

# సీసీఐ పునఃప్రారంభంపై ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించాలి మాజీ మంత్రి జోగు రామన్న



**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ సిమెంట్ పరిశ్రమ పునఃప్రారంభం కోసం సీసీఐ సాధన కమిటీ అనేక సందర్భాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటికీ స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ పునఃప్రారంభ విషయంలో చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో 'హలో యువతలో సీసీఐ పరిశ్రమ'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం సీసీఐ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.పరిశ్రమలో స్క్రాప్‌గా మార్చిన ప్రాంతాలను జోగు రామన్న, సీసీఐ సాధన కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కళ్లముందే యువత ఆశలు చెదిరిపోతుంటే అండగా నిలవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వలాభాల కోసం పరిశ్రమను తుక్కుగా మారుస్తున్నాయని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లా పరిశ్రమలు లేని వెనుకబడిన జిల్లాగా ఉందని, సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభమైతే వేలాది మంది యువతీ యువకులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర నాయకులు బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలపై స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.స్క్రాప్ టెండర్ల వ్యవహారంపై తాము ప్రశ్నించినప్పటికీ ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. భూ నిర్వాసితులు తమ భూములు కోల్పోయి ఇబ్బందులు పడుతుండగా, వందేళ్లకు సరిపడా ముడి సరుకు ఉన్నప్పటికీ పరిశ్రమ పునఃప్రారంభానికి ఒత్తిడి తేవడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విమర్శించారు. రానున్న రోజుల్లో ఆదిలాబాద్ ప్రజలు దీనిపై గట్టి తీర్పు ఇస్తారని హెచ్చరించారు.సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో దర్శనాల మల్లేష్ సీసీఐ సాధన కమిటీ కన్వీనర్, విజ్జగిరి నారాయణ కో కన్వీనర్, కొండ రమేష్, బొల్లు ఈశ్వర్, నంది రామయ్య, గోడం గణేష్, వెంకట నారాయణ, అరుణ్ కుమార్, ముని గెల నర్సింగ్, లంక రాఘవులు, లోకారి పోశెట్టి, బండి దత్తాత్రి, జగన్ సింగ్ భూ నిర్వాసితులు కస్తాల అరుణ్, కస్తాల ప్రేమల, ఉగ్గే విట్టల్, నాయకులు పట్టణ అధ్యక్షులు అజయ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేష్,దాసరి రమేష్, వెనగంటి ప్రకాష్,కొండ గణేష్ దమ్మ పాల్, అన్నల వసంత్, పండ్ల శ్రీను, బట్టు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మహిళలకు రక్షణ లేదు గొంగిడి సునితామహేందర్ రెడ్డి



**హైదరాబాద్ :** రాష్ట్రంలో చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగాయి. ఆడ పిల్లల్ని కనాలంటే భయపడే పరిస్థితి రాష్ట్రంలో ఉందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ..మోదీ భేటీ బచావో భేటీ పడావో అంటారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి తెలంగాణలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర హోం మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు.ఫోక్సో కేసులు దేశంలో 6 శాతం నమోదు అయితే ఒక్క తెలంగాణలో 16శాతం ఫోక్సో కేసులు నమోదు అయ్యాయని విమర్శించారు. తెలంగాణలో క్రైమ్ రేట్ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.
రేవంత్ రెడ్డి రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఇప్పటి వరకు సమీక్ష చేయలదని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ సర్పంచ్ చిన్నారిపై దాడి చేస్తే పోలీసు వాళ్లు సెటిల్ మెంట్ చేశారు. తెలంగాణలో మహిళలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సీఎం అంటున్నారు. ముందు తెలంగాణలో చిన్నారులను కాపాడండి.
తెలంగాణలో మహిళలపై జరుగుతున్న దాడులు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీకి తెలియవా అని ప్రశ్నించారు. బండి భగీరథ్ కేసు విషయంలో తొలుత వీక్ సెక్షన్లు పెట్టారు. రాష్ట్రంలో మహిళలు రోడ్డు ఎక్కితే అప్పుడు సెక్షన్లు మార్చారని గుర్తు చేశారు. చిన్నారులపై అఘాయిత్యాలపై పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలిన డిమాండ్ చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మహిళలకు ధైర్యం ఉండేదన్నారు.

# బీఆర్ఎస్ లోకి రామకృష్ణకాలనీ సర్పంచ్



**తిమ్మాపూర్,జూన్16:** తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణకాలనీ గ్రామ సర్పంచ్ గుజ్జుల శ్వేత ప్రణీత్ రెడ్డి, ఉప సర్పంచ్ పోలం మల్లేష్, వార్డు సభ్యులు దాడి దేవకీఓదెలుతో పాటు నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి, పలు గ్రామాలకు చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. హరీష్ రావు వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

# చిగురుమామిడి తహసీల్దార్‌గా కోడం కనకయ్య



**చిగురుమామిడి, జూన్ 16 :** చిగురుమామిడి తహసీల్దార్‌గా కోడం కనకయ్య నియమితులయ్యారు. కనకయ్య వీణవంక, తిమ్మాపూర్, కరీంనగర్ అర్బన్, హుజురాబాద్, గన్నేరవరం మండలాల్లో విధులు నిర్వహించి బదిలీపై చిగురుమామిడికి రానున్నారు.
ఆయా మండలాల్లో విధి నిర్వహణలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ ముద్దసాని రమేష్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది.

# బుధవారం రామగుండం మున్సిపల్ ఆఫీసు ఎదుట నిరాహార దీక్ష సీఐటీయూ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి



**కోల్ సిటీ, జూన్ 16 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మున్సిపల్ కార్మికుల అడ్డాపై జరిగిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర యేళ్లు గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన విధంగానే మున్సిపల్ కార్మికులు సైతం మోసపోయారని అన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలనీ, రెండో పీఆర్సీలో కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి కేటగిరిలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యంను ఎండగడుతూ ఈనెల 18, 19 తేదీల్లో అన్ని మున్సిపల్ కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సేవలపై సీపీఎం ఆగ్రహం




**కలెక్టరేట్, జూన్ 16 :** సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్ సేవలు పేద ప్రజలకు అందడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్ ఆరోపించారు. స్థానిక కార్మిక భవన్‌లో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పేదలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించేందుకు ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదని విమర్శించారు. అత్యవసరంగా రక్తం అవసరమైన బాధితులు ఆసుపత్రికి వస్తే, మరో వ్యక్తి రక్తదానం చేస్తేనే రక్తం ఇస్తామని నిబంధనలు పెట్టడం వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే, ఆసుపత్రిలో తాజా రక్తం అందుబాటులో లేదంటూ రోగులు, వారి కుటుంబ సభ్యులను భయాందోళనలకు గురిచేసి ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులను ఆశ్రయించాలని సూచిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో లభించాల్సిన సేవల కోసం ప్రజలు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ వెంటనే విచారణ జరిపి, బ్లడ్ బ్యాంక్ సేవలను పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీరాములు, రమేష్ చంద్ర, అలువాల లక్ష్మణ్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

# హైస్కూల్‌లో ఇంగ్లీష్ టీచర్ వింత ప్రవర్తన

**జనగామ జిల్లా:** ప్రభుత్వ పాఠశాలలో టీచర్ వింతగా ప్రవర్తించడం చర్చనీయాంశంగా మారింది. టీచర్ ప్రవర్తనతో విసిగిపోయిన విద్యార్థులు ఈ టీచర్ మాకొద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. జనగామ జిల్లా చిల్పూర్ మండలంలోని ఓ హైస్కూల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. సదరు హైస్కూల్‌లో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ విద్యార్థుల పట్ల వింతగా ప్రవర్తిస్తోంది. జనగణన సమయంలో ఇంగ్లీష్ టీచర్ విద్యార్థినిని అనవసరపు ప్రశ్నలు వేసింది.
ఈ విషయంపై సర్పంచ్ రాజు సదరు ఇంగ్లీష్ టీచర్‌ను ప్రశ్నించగా.. పుస్తకాలు విసరడం, వెకిలిగా నవ్వడం, హెచ్ఎం కుర్చీలో కూర్చొవడం, పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించింది. ఆమె ఇలా వింతగా ప్రవర్తించడానికి గల కారణాలు తెలియాల్సి ఉండగా.. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.

# ఎమ్మార్పీ ధరలకు విత్తనాలు,ఎరువులు విక్రయించాలి పెద్దకొడప్‌గల్ ఏవో కిషన్



**పెద్ద కొడవ్ గల్, జూన్ 16 :** విత్తనాలు ఎరువులు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్టం పరమైన చర్యలు తీసుకుంటామని పెద్దకొడప్‌గల్ ఏవో కిషన్ విత్తనాలు, ఎరువుల దుకాణాల యజమానులకు హెచ్చరించారు. పెద్దకొడప్ గల్ మండల కేంద్రంలోని పలు విత్తనాలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశా రు.దుకాణదారులు విత్తనాలు ఎరువుల వివరాలను ప్రతిరోజు తప్పకుండా రికార్డులో నమోదు చేయాలన్నారు. రైతులకు ఒరిజినల్ రసీదు ఇవ్వాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తయారీ గడువు తేదీ, సీల్, లాట్ నంబర్లు కలిగి ఉన్న విత్తనాలను ు చేయనిరైతులకు సూచించారు.

# యూరియా యాప్ రద్దు చేయాలని మోర్తాడ్ లో రైతుల రాస్తారోకో



**మోర్తాడ్ :** యూరియా యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మోర్తాడ్ సొసైటీ పరిధిలోని ఆరు గ్రామాల రైతులు మంగళవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యాప్ విధానం వల్ల యూరియా సరైన సమయానికి అందడం లేదని యాప్ వాడడం తెలియక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలో ఏర్పడుతున్నాయని, కావున యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
ప్రతీ రైతుకు అవసరం ఉందని యూరియా సంచులను పాత పద్ధతిలో అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.

PRGI No: TGBIL/25/A0946
సమగ్ర తెలుగు దినపత్రిక

# 35 నిమిషాల్లోనే చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్

## గాలింపు చర్యలు ముమ్మరం చేశాం డీఎస్పీ తిలక్

**కాకినాడ, జూన్ 16 :** కాకినాడ జిల్లా తుని చిన్నారి జ్ఞానేశ్వరి కేసుపై పెద్దాపురం డీఎస్పీ తిలక్ కీలక విషయాలు వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈరోజు(మంగళవారం) డీఎస్పీ తిలక్ మీడియాతో మాట్లాడారు. 35 నిమిషాల వ్యవధిలో బాలిక మిస్సయిందని చెప్పుకొచ్చారు. చిన్నారి జ్ఞానేశ్వరి సమాచారం తెలిసిన వెంటనే గాలింపు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. జీడీ పిక్కలు ఏరుకునే వారిని కూడా పిలిచి చిన్నారి గురించి విచారించామని తెలిపారు. పాప మిస్సయిన చోట బొమ్మలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. చిన్నారిపై తప్పుడు వార్తలను ప్రచురిస్తే లీగల్‌గా చర్యలు..చిన్నారికి సంబంధించి తప్పుడు వార్తలను ప్రచురించే వారిపై లీగలగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తిలక్ హెచ్చరించారు. పాపను జంతువులు తీసుకెళ్లాయనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. జీడి పిక్కలను ఏరుకునే సంచార జాతుల వారిపై నిఘా పెట్టి విచారణ చేస్తున్నామని తెలిపారు. చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబం పెంచుకుంటున్న కుక్కకు నాలుగు రోజులుగా ఎలాంటి ఆహారం లేకపోవడంతోనే చనిపోయిందని వెల్లడించారు.

కుక్క పోస్టుమార్టం రిపోర్టు రెండు రోజుల్లో వస్తుందని డీఎస్పీ తిలక్ పేర్కొన్నారు.




# రఘురామ కేసులో కొత్త ట్విస్ట్ మెడికల్

## రిపోర్టులు సమర్పించాలని హైకోర్టు ఆదేశం




**అమరావతి,జూన్16:** వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి తెలుగుదేశం ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజుకి సంబంధించిన కస్టోడియల్ టార్చర్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఈరోజు(మంగళవారం) ఈకేసుపై విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని మెడికల్ రిపోర్టులను తమ ముందుంచాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన మెడికల్ బోర్డు నివేదికలు, వైద్య పరీక్షల పూర్తి రికార్డులు, ఇతర సంబంధిత పత్రాలను కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. సీఐడీ అధికారులు తనను కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని రఘురామ గతంలో ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై న్యాయస్థానం ఆదేశాల మేరకు మెడికల్ బోర్డు, వివిధ విభాగాధిపతులు నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను తారుమారు చేయడానికి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రయత్నిస్తున్నారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే, తప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మెడికల్ బోర్డును రక్షించేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రయత్నిస్తున్నారని కూడా పిటిషన్‌లో రఘురామ ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో గతంలోనే సంబంధిత మెడికల్ రిపోర్టులను భద్రపరచాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఆ రికార్డులన్నింటినీ న్యాయస్థానం ముందుంచాలని మరోసారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటిలోగా అన్ని వైద్య రికార్డులు, మెడికల్ బోర్డు నివేది కలు, సంబంధిత పత్రాలను సమర్పించాలని అధికారులను ఆదేశించింది. ఈ కేసులో మెడికల్ ఆధారాలు కీలకంగా మారనున్న నేపథ్యంలో ఏపీ హైకోర్టు తాజా ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఇంటింటికీ టీడీపీ 45 రోజుల కార్యక్రమానికి మంత్రి లోకేశ్ పిలుపు




**అమరావతి, జూన్ 16:** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ మంత్రి నారా లోకేశ్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర, జాతీయ కార్యవర్గంతో ఈరోజు(మంగళవారం) మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూటమి పాలన రెండేళ్ల విజయాలపై ఈ నెల 25వ తేదీ నుంచి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ నేతలు వెళ్లాలని పిలుపునిచ్చారు. మొత్తం 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సుమారు రెండు గంటల పాటు ఈ సమావేశం కొనసాగింది. అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లాలని యువనేత దిశానిర్దేశం చేశారు. తమ ఇబ్బందులను కొంతమంది ఎమ్మెల్యేలు లోకేశ్‌కి వివరించారు. అర్హులైన వారు కొత్త పెన్షన్లు అడుగుతున్నారని తెలిపారు. గ్రామానికి వెళ్లిన వెంటనే చిన్న చిన్న పనులు అడుగుతున్నారని, దీనికి కొంత నిధులు ఇవ్వాలని కోరారు. ఈ సమస్య తనకు కూడా ఉందని.. ఏపీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోవాలని ఎమ్మెల్యేలకు లోకేశ్ సూచించారు. అన్ని విషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని యువనేత మార్గనిర్దేశం చేశారు. వారానికి కనీసం నాలుగు రోజులైనా ఈ కార్యక్రమం నిర్వహించాలని లోకేశ్ ఆదేశించారు.

# ఫీడ్ ధరల పెంపు ఇక కుదరదు ప్రభుత్వ

## అనుమతి తప్పనిసరి మంత్రి అచ్చెన్నాయుడు

**పార్వతీపురం మన్యం, జూన్ 16 :** అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచితే ఊరుకునేది లేదని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచడాన్ని నిలిపివేశామని స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు.ప్రతి చిన్న అంశాన్ని రాజకీయం చేయడం గొడ్డలి పార్టీ అధ్యక్షుడి నైజం..ప్రతి చిన్న అంశాన్ని రాజకీయం చేయడం గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి నైజమని మంత్రి అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో విద్యుత్ సబ్సిడీ కేవలం రూ.750 కోట్లు ఇచ్చారని అన్నారు. కూటమి ప్రభుత్వం రొయ్యల రైతులకు ఏడాదికి రూ.1,170 కోట్ల విద్యుత్ సబ్సిడీ ఇస్తుందని స్పష్టం చేశారు. సోయాబీన్, ఫిష్ ఆయిల్ ధరలు పెరిగిన మాట వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ముడి పదార్థాల ధరల భారం రైతులపై ఒక్కసారిగా మోపడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం, అధికారులు, రైతులు, తయారీదారులతో కూడిన కమిటీ ద్వారానే ఇకపై ధరల నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు.రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం..రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. జోన్, నాన్-జోన్, 10 ఎకరాల పరిమితి నిబంధనలని తొలగించామని తెలిపారు. ప్రతి ఆక్వా రైతుకూ యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. గతంలో ల్యాబ్‌ల పేరుతో ప్రచారం తప్ప క్షేత్రస్థాయిలో సౌకర్యాలు లేవని ప్రస్తావించారు. రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వచ్చి వాస్తవాలు పరిశీలించాలని గొడ్డలి పార్టీ అధ్యక్షుడుకి సవాల్ విసిరారు. ఫీడ్ ధరల నియంత్రణకు దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు.



# మోదీ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థ

## వేగంగా దూసుకెళ్తోంది ప్రహ్లాద్ జోషి

**విజయవాడ,జూన్16:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో ఏ మంత్రిపై ఏవిధమైన ఆరోపణలు లేవని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. డిజిటల్ ఇండియా మిషన్ ద్వారా చాలా మార్పులు వచ్చాయని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అతి తక్కువ డేటా ధర ఉన్న దేశం మనదని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) విజయవాడలో ప్రహ్లాద్ జోషి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఆధార్‌కు అన్నివిధాలా ఆధారాలు కల్పించామని పేర్కొన్నారు. విద్యుత్ అవసరం 123 గిగావాట్లు దాటిపోయిందని ప్రస్తావించారు. 281 గిగావాట్ల సామర్థ్యాన్ని సైతం చాలా తేలిగ్గా నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు.

**విద్యుత్‌ని అభివృద్ధి చేశాం..**

సన్‌తో తాము విద్యుత్‌ని అభివృద్ధి చేశామని.. కాంగ్రెస్ సన్‌తో వెనుకపడిందని ప్రహ్లాద్ జోషి ఎద్దేవా చేశారు. మోదీ 12 ఏళ్లు, చంద్రబాబు 2 ఏళ్లు పూర్తి చేసుకున్న శుభ సమయం ఇదని తెలిపారు. నెహ్రూ కంటే ఎక్కువ కాలం ప్రధానిగా ఉండటమే గొప్ప కాదని... ప్రధానిగా మోదీ గత 12 ఏళ్లుగా చేసిన అభివృద్ధి గొప్ప అని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం తామే ఇచ్చామని కాంగ్రెస్ నేతలు చెప్పుకున్నారని.. కానీ ఆ పార్టీలో ఏదైనా చేశామని చెప్పుకునే అంశాలు అసలు లేవని చెప్పుకొచ్చారు.పీవీ నరసింహారావు దేశంలో చాలా మార్పులు చేశారు..1991లో రాజీవ్ గాంధీ మరణం తర్వాత దేశంలో ఎలక్షన్ మొత్తం వాయిదా వేశారని ప్రహ్లాద్ జోషి తెలిపారు. పీవీ నరసింహారావు దేశంలో చాలా మార్పులు చేశారని కొనియాడారు. 2004 నుంచి 2014 వరకూ కాంగ్రెస్ ఏం చేసిందో అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ హయాంలో రూ.12 లక్షల కోట్ల స్కాం జరిగిందని ఆరోపించారు. ప్రధాని మోదీ ఏ ఎన్నిక కూడా ఓడిపోలేదని తెలిపారు. పాలసీ వైకల్యం ఉన్న ప్రభుత్వం నుంచి నిర్ణయాత్మక ప్రభుత్వంగా బీజేపీ ప్రభుత్వం వచ్చిందని ప్రస్తావించారు. కాంగ్రె స్ ప్రభుత్వంలో భారత ఆర్థిక వ్యవస్థ బలహీనమైందని విమర్శించారు. మోదీ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.




# గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ఏపీ

## మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రియాక్షన్

**అమరావతి, జూన్ 16:** వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ స్పందించారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏపీ హోంమంత్రి అనిత గురించి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించాల్సినవే అని చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని.. కానీ మహిళలను అవమానించేలా మాటాడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఒక మహిళా మంత్రిని 'మేకప్ మంత్రి' అని సంబోధించడం ఆమెను మాత్రమే కాదు, మహిళలందరినీ అవమానించినట్టే అని మండిపడ్డారు.

**వ్యక్తిగత దూషణలు సరికాదు..**

మహిళల రూపం, దుస్తులు, మేకప్ గురించి మాట్లాడటం రాజకీయ విమర్శ కాదని... అది మహిళల గౌరవాన్ని కించపరచడమే అని శైలజ వ్యాఖ్యానించారు. ఒక మహిళను ఆమె రూపాన్ని బట్టి కాదని, ఆమె పనితీరు, సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మరింత బాధాకరమన్నారు. రాజకీయ విభేదాలు ఉంటే విధానాలపై చర్చించాలి గానీ, వ్యక్తిగత దూషణలకు దిగకూడదన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతాయన్నారు.

**ఈ వ్యాఖ్యలను సమాజం అంగీకరించదు..**

మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న ఈ సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అత్యంత విచారకరమని రాయపాటి శైలజ అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మరింత మంది మహిళలు రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తిని దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న ఈ సమయంలో వారిని నిరుత్సాహపరిచే వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా రాజకీయంగా ఎవరూ ఎదగలేరన్నారు. నైతిక విలువలు, సంస్కారం లేనివారు ఎప్పటికీ నిజమైన నాయకులు కాలేరని అన్నారు. మహిళల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజా జీవితంలో ఉన్నవారికి ఆ బాధ్యత మరింత ఎక్కువ అని చెప్పుకొచ్చారు. ఇలాంటి వ్యాఖ్యలను మహిళా సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఈ వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గుడివాడ అమర్‌నాథ్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని రాయపాటి శైలజ డిమాండ్ చేశారు.

**మహిళా కమిషన్ సీరియస్..**

హోమ్ మంత్రి అనితను కించపరిచే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. అమర్‌నాథ్‌పై చర్యలు తీసుకోవాలని డీజీపీకి కమిషన్ లేఖ పంపనుంది. అదేవిధంగా.. గుడివాడ అమరనాథ్‌కు సమన్లు ఇవ్వాలని మహిళా కమిషన్ నిర్ణయించింది. కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడమే గాకుండా సమర్థించుకునే విధంగా మాట్లాడుతున్నారని మహిళ కమిషన్‌కు పలువురు ఫిర్యాదు చేశారు.




# ప్రముఖ యువ గాయని శ్రీలలితకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అభినందనలు

**విజయవాడ, జూన్ 16:** విజయవాడలో వివిధ కార్యక్రమాలలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ యువ గాయని శ్రీలలిత నివాసానికి కేంద్ర మంత్రి విచ్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 12 ఏళ్ల సుపరిపాలన, సాధించిన విజయాలపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని శ్రీలలితకు అందజేశారు. కర్ణాటక, హిందుస్తానీ సంగీత శైలులు రెండింటిలోనూ రాణిస్తున్న శ్రీలలితను ప్రహ్లాద్ జోషి అభినందించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రెండు విభిన్న సంగీత ప్రక్రియలను నేర్చుకోవడం ఎంతో కష్టతరమన్నారు.

గతంలో ప్రధాని మోదీ స్వయంగా శ్రీలలిత ప్రతిభను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశంసించారని తెలిపారు. కర్ణాటకలో ధార్వాడ్.. హిందుస్తానీ సంగీతానికి ఎందరో మహానుభావులను అందించిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ సాధించిన అద్భుత ప్రగతిని, ప్రపంచ సంక్షోభాల సమయంలోనూ దేశాన్ని సమర్థవంతంగా నడిపించిన తీరు గురించి అందరూ తెలుసుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ఇక్కడి రాజధానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రత్యేక పూజలు చేశారు. ఈరోజు (మంగళవారం) ఇంద్రకీలాద్రి చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు, దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ స్వాగతం పలికారు.

